# గోదావరి సుడులు

వరదలు కట్టి ప్రవహిస్తున్న గోదావరిలో సుడిగుండాలు తిరుగుతూ న్నట్లు రామమూర్తి హృదయంలోనూ ఆవేదనలు సుడులు చుట్టుతున్నాయి. 15 ఆగష్టు 1947న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దేశపు అవతార పురుషుడు, తేజస్వరూపుడు, ప్రేమమూర్తి విశ్వంలో లీనమైపోయినాడు. 15 ఆగష్టు 1948లో స్వతంత్రోత్సవం కూడా జరిగిపోయింది. కాని ఈ దుర్భరావేదన మాత్రం తప్పటంలేదు, తాను రాజ మహేంద్రవరంనుంచి అయిదేండ్లు క్రిందట హైదరాబాదు రాష్ట్రింపోయి నిజాం ప్రభుత్వంవారి పబ్లిక్ వర్క్సు శాఖలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఉద్యోగం ఖాయ మైంది. ప్రభుత్వం వారు జీతం కూడా హెచ్చించారు. తాను శక్తి వంచన లేకుండా ప్రభుత్వానికీ, ప్రజలకు సేవచేస్తున్నాడు.

ఆ జిల్లాలల్లో తిరిగేటప్పుడు రామమూర్తి ఆనందం వర్ణింప అలవి కాకుండా ఉండేది. ఇంకా మొగలుకాలంనాటి ఆచారాలే సంస్థానంలో ఉండడం చేత అతడు ఉన్న ప్రదేశంలో అతడే మహారాజులాగుండేవాడు. తనకు గవర్నరంత హోదా, ప్రజల బ్రతుకు, పంటల బ్రతుకు తనచేతిలో ఉండెను. దేశముఖులు, వతందార్లు మక్తాదర్లు, కౌలుదార్లు, పెద్దరైతులు, షావుకార్లు, పటేలు—పట్వారీలు, పోలీసు ముంతజిందు—అందరూ తనకు 'అదాబర్జ్' చేస్తూ, తన్ను గౌరవిస్తూ అంచలం ఎక్కించేవారు. పుష్కలంగా సప్లయిలు, జేబులనిండా బహుమతులు. తన జీవితం హాయిగా జరిగిపోయింది.

రామమూర్తి ఓవర్సీర్ పరీక్ష ప్యాసయినా కొంచెం రసజ్ఞుడు. హైదరాబాదు సంస్థానం లోని కొండలు, నదులు, సెలయేర్లు, చెరువులు

అతని కెంతో ఆనందం కలుగజేసేవి: జీవితాలు ప్రవహించిపోవడం నదుల నడకలలో, జీవిత సత్యస్థిరత్వం కొండలస్థాణుత్వంలో, బ్రతుకులోని ఆనంద నృత్యం సెలయేటిజలజలలో, మనుష్యుడు కల్పించుకున్న సౌభ్యాలు తెలంగాణపు చెరువులలో అతనిక గోచరించేవి.

సాధారణప్రజలు గర్భదారిద్ర్యంలో ఉండి దేశముఖులకు బానిసలులా మెలుగుతూ ఉన్నా-వా రా కష్టాలలో నుండి జీవితం శుచిగా ఉంచుకుంటూ బురదనుండి పైకిప్రసరించి వికసించే నీలికలువపూవును వేసికుంటూ, పాటలు పాడుకుంటూ, తమకు తెలియని ఏదో ఒక స్వర్ణయుగంకోసం ఎదురుచూస్తూ ఉదయాస్తమానాలు ఒక దివ్యరాగంతో కలుపుకుంటూపోతున్నారు. ఆ ఆ తెలంగాణా, మరాత్వాడా, కర్ణాటక ప్రజలు స్వాతంత్ర్యం అంటే ఎరుగరు. “దొరా! నీ పాదాలకి మొక్కుతా” అంటారు. అన్నా, ఆ మాటల వెనక తాము ఆహుతిచ్చే ఆత్మార్పణ ఆతనికి దృశ్యమయ్యేది. అతడు నిట్టూర్పు విడుస్తూనే గుర్రంస్వారీ చేసుకుంటూ అవతలి మకాంకు వెళ్ళిపోయే వాడు.

ఈ ఆలోచనలు రాజమహేంద్రవరపు గోదావరి గట్టుమీద కూర్చున్న రామమూర్తి హృదయంలో నుంచి ప్రవహించి గోదావరి వరదల సుడులలో లీనమై పోతున్నవి.

## 2

రామమూర్తి ప్రభుత్వోద్యోగి అని తెలిసి ఉండి కూడా రాక్షసుల లాంటి రజాకార్లు అతని ఇంటిమీదపడి దోచుకున్నారు అందాల ప్రోగైన అతని భార్యను వాళ్ళు పట్టుకోబోయే సమయంలో ఎక్కడి నుంచి వచ్చారో

ఒక కమ్యూనిస్టుల గుంపు ఆ రజాకార్లపై విరుచుకుపడింది. రజాకార్లు రామమూర్తి ఇల్లు దోచడం మాని కమ్యూనిస్టులను ఎదుర్కోడానికి పరిగెత్తారు. వృశ్చిక రోముడుకూ-సర్పరోముడుకూ యుద్ధంజరిగినట్లు జరిగింది. రామమూర్తి ఆ గడబిడసమయంలో, కొందరి గ్రామ ప్రజల సహాయంతో, ఊరుదాటి అడవి దుప్పలంబట పడి గ్రామాల అంచలు దాటుకుంటూ, గోదావరి యొడ్డుకు వచ్చి ఓ కోయ జట్టు సహాయంతో భద్రాచలం చేరుకున్నాడు.

దారిలో అతడూ-అతని భార్యా పడిన పాట్లు రామాయణంలోని అరణ్యకాండ అంత గాథ అయింది. ఎలాగో నానా కడగండ్లుపడి రాజమండ్రి చేరుకున్నారు. ఇంటిదగ్గర పెద్ద సంసారం. తాను హైద్రాబాదులో ఓవర్సీరై బాగా సంపాదిస్తూ ఇంటిదగ్గర తమ్ముళ్ళ చదువు చెప్పిస్తూ, తల్లిదండ్రులను పోషిస్తూ, తన అక్క చెల్లెండ్రను పురుడూ-పుణ్యాలకు ఆదరిస్తూ డబ్బు పంపించేవాడు. ఇంతటితో అటవిడుపు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, హైద్రాబాదుకు స్వాతంత్ర్యం లేదు: తనకు దిక్కులేదు. తాను తిరిగి హైద్రాబాదు వెళ్ళడానికి వీలులేదు. తనకు స్వతంత్ర భారతంలో ఉద్యోగంలేదు. తాను ఓవర్సీర్ ఉద్యోగం చేస్తూ సంపాదించిన పెళ్ళాం మెళ్ళో నగలూ, వెండి సామానూ ఖర్చయిపోయింది. భారత ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నాడు: మద్రాసు ప్రభుత్వానికి గూడ దరఖాస్తు పెట్టుకున్నాడు. తన దరఖాస్తులు శుష్కలంగా తిరిగి వచ్చాయి. గోదావరి సుళ్ళు చుట్టుకుంటూ ప్రవహించిపోతోంది.

## 3

గోదావరి చల్లని తల్లి. తాను చిన్నతనంలో, రాజమహేంద్రవరంలో చదువుకొనే రోజుల్లో వేసం కాలపు గోదావరిని ఆవలికీ ఈవలికీ ఈదుతూ దాటేవాడు. కరుణామయి అయిన ఆమె హృదయం పైన తేలి పోయేవాడు. ఆమె నీలనీరగంభీరాలలో మునిగితేలుతూ ఉండేవాడు. ఈ గోదావరి తల్లి నీటిని ఉపయోగించుకునేందుకు తనకు ఛామన్నా లేదు. తాను పరీక్షప్యాసయిన కొత్తదినాల్లో మదరాసు రాష్ట్రంలో ఉద్యోగమే దొరక్కపోయింది. తాను బ్రాహ్మణుడనై పుట్టడం దౌర్భాగ్యమైంది. తెలంగాణాలో కులం తేడాలు లేవు. గోదావరి తల్లికి కులం తేడాలు లేవు. హీనుడైన మనుష్యునికే కులంతేడాలూ: మతం తేడాలూను.

అవమానదగ్ధులైన వారిని, అహంకారులను ఆనందమయులను, విచార మేఘావృత జీవులను, కోటీశ్వరులను, నిరుపేదలను, భూకామం దులను, నిరుపేద పొలం కూలీని సరిసమాన ప్రేమతో ఈ కన్నతల్లి తన గర్భాన దాచుకొని ఊరడించగలదు.

అతడు ఎత్తయిన ఆ గట్టుపైన నిలబడి నెమ్మదిగా నీటి దగ్గరకు పోయాడు. చొక్కా, కండువా తీసి పైనబెట్టాడు. వరదకు కొట్టుకువచ్చే పుల్లలను పోగుజేసుకొనే ముసలమ్మనూ, పిల్లలను వత్తిగించుకుంటూ నీటిలో దిగాడు. మహాత్ముని తలచుకుంటూ ఒక్క ఉరుకు ఉరికాడు. ఆ వేగంతో చాలాదూరం నీళ్ళల్లోకి పోయిన అతని మూర్తినిగోదావరి తల్లి తనచేతులతో, కప్పింది కాని ఈత ఎరిగిన యువకుడవడంచేత ఆమెకూడా తనలో లీనం చేసుకోలేకపోయింది. ఆ ముసుగులో గర్భవతియైన అతని భార్యా ముదుసలులైన తల్లిదండ్రులూ అతని హృదంతరాల ప్రత్యక్షమయినారు, బాపూజీ! క్షమించమంటూ ఈదుకుంటూ వడ్డుకువచ్చి, మెట్లెక్కి తన కండువా తీసుకొని తలతుడుచుకుంటున్నాడు. ఇంతల్లో గబగబా పరుగెత్తు

కుంటూ తన తమ్ముడక్కడకు వచ్చాడు. "నీవు గోదావరిగట్టున ఉంటావని మ వదిన చెప్పడంవల్ల, నీవు సాధారణంగా కూర్చుంటావని ఇక్కడకు వచ్చాను. ఇప్పుడే టెలిగ్రామ్ వచ్చింది. నిన్ను రామపాదసాగరం ప్రాజెక్టులో ఓవర్‌సీరుగా చేయించగలిగేనని శాంతి రామమూర్తిగారు నీకు టెలిగ్రాం యిచ్చారు. నీకు రేపో, ఎల్లుండో ఆర్డర్లు వస్తాయట. ఇదిగో టెలిగ్రాం."

రామమూర్తికి కళ్ళనీళ్ళు తిరిగాయి. గోదావరి వరద ప్రవాహాలు సుడిగుండాలు తిరుగుతూ వెళ్ళిపోతున్నవి.

★